క్లుప్తంగా

నేడు ఉప్పరపల్లెకు ఎమ్మెల్యే రాక

చెన్నూరు : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహణలో భాగంగా ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మండలంలోని ఉప్పరపల్లెకు రానున్నట్లు ఎంపీటీసీ ఎరసాని నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

స్వీట్లు పంపిణీ

పులివెందుల టౌన్ : స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల భవనంలో ఆదివారం సంక్రాంతి సంబరాల కార్యక్రమానికి అర్బన్ సీఐ రాజుతోపాటు ఎస్ఐలు చిరంజీవి, హుసేన్‌లు సాంప్రదాయ దుస్తులతో దివ్యాంగుల నడుమ సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. వారికి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో దివ్యాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ఏఎస్ఐ చంద్రశేఖర్‌స్వామి, శివమహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలండర్ ఆవిష్కరణ



క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు: తొగట వీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో 2023 క్యాలండర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే కార్యాలయంలో క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు సూర్యనారాయణ, వేపరాల ఎంపీటీసీ అలిశెట్టి కుమార్, సుబ్బయ్య, ఓబుల కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

చెన్నూరు : చెన్నూరు మైనార్టీ కాలనీ 4వ వార్డు లోగల షేక్ ఖాదర్ (బొంబాయి దాదా) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని మండల కో ఆప్షన్ సభ్యులు వారిస్ వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే స్పందించి కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డికి చెందిన పోచిమరెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ద్వారా దహన సంస్కారాల నిమిత్తం మృతుని కుటుంబ సభ్యులకు రూ. 5 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు అన్వర్, షేక్‌హస్రత్, పూల షబ్బీర్, నాయబ్, వైఎస్సార్ సీపీ నాయకులు, మైనార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేలం పాట



అమ్మవారి చీరెలను వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి అమ్మవారి చీరెల వేలంపాటను ఆదివారం సాయంత్రం ఆలయ కమిటీ నిర్వాహకులు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు అందించిన చీరెలను ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ సందర్భంగా వేలం పాటను నిర్వహిస్తుంటారు. అందులో భాగంగానే ఆదివారం సాయంత్రం ఆలయం ఆవరణంలో వేలం పాటను నిర్వహించారు. పట్టు చీరెలు సహితం అమ్మవారి పాటను రూ.100 నుంచి వేలం పాటను కొనసాగించారు. ఇలా చీరెల వేలం పాటలో వచ్చిన మొత్తంను ఆలయం అభివృద్ధి పనులకు కేటాయించారు.

ఆటను ఆస్వాదించాలి



పోటీలలో గెలుపొందిన వారికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు: ప్రతి క్రీడాకారులు తమలో దాగిఉన్న ప్రతిభను బయటికి తీసి ఆటలను ఆస్వాదించాలని మే ఐ ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మణ్‌మోరె పేర్కొన్నారు. సోమవారం డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన క్రికెట్ జట్టుకు బహుమతి ప్రదాన కార్యక్రమాన్ని స్థానిక పతంగే రామన్నరావు ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. అనంతరం సీపీఎం నాయకుడు శివనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ నాయకుడు వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఊరంతా సంక్రాంతి



జమ్మలమడుగు రూరల్: ఉప్పలపాడు గ్రామంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం



ఎర్రగుంట్ల: ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



చెన్నూరు: సంక్రాంతి సంబరాలలో భాగంగా పెన్నానదిలో నిర్వహించిన పారువేట ఉత్సవంలో పాల్గొన్న భక్తజనం

పులివెందుల టౌన్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో సంబరాలు జరుపుకున్నారు. తెల్లవారు జామునలేచి తలంటు స్నానాలు ముగించుకుని ఇంటి ముంగిట మహిళలు రంగు రంగుల ముగ్గులను తీర్చిదిద్దారు. గొబ్బెమ్మలను ఉంచి పూలతో అలంకరించి పూజలు చేశారు. ముగ్గులు వేయడంలో పోటీ పడ్డారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి తమ ఇష్ట దేవుళ్లను వేడుకున్నారు. ఇళ్లవద్ద దేవుడి మందిరంలో పంచభక్ష పరమాన్నాలను, ఓలిగలు, చిత్రాన్నం తీపి వంటలు పెట్టి పూజలు చేశారు. బంధువులు, మిత్రులతో ఆనందంగా గడిపారు. పట్టణం నుండి గ్రామాలకు వెళ్లి సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆప్యాయంగా పలుకరించుకున్నారు. గాలిపటాలు ఎగుర వేశారు. సాంప్రదాయ దుస్తులతో కనువిందు చేస్తూ ఆచారాన్ని పాటించారు. సోమవారం కనుమ పండుగ రావడంతో కొంతమంది మంగళవారం కనుమ పండుగ జరుపుకొనేందుకు సిద్ధమయ్యారు. గ్రామాలలో ఆటల పోటీలు ఘనంగా నిర్వహించారు. యువకులు వివిధ రకాల ఆటలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. బంధు మిత్రులకు విందు ఏర్పాటు చేసి ఆనందాన్ని పంచుకున్నారు.

ఆనందాల శిల్పారామం

శిల్పారామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సందర్శకులు పెద్దసంఖ్యలో హాజరై కనువిందుచేశారు. అక్కడ నిర్వహి ంచిన సాంస్కృతిక నృత్యాలను తిలకించి ఆనందంగా గడిపారు. బలిజ సంఘ అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్, పారిశ్రామికవేత్త కోలా ప్రసాద్ సహకారాలతో ఆటవిడుపు కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో చిన్నారులు తమదైన శైలిలో చిందులు వేసి అందరినీ మెప్పించారు. జానపద, శాస్త్రీయ నృత్యాలతోపాటు సినిమా గీతాలకు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ పర్యవేక్షించారు.

సింహాద్రిపురం : మండలంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. మూడురోజుల పాటు ప్రజలు పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో ఆటలపోటీలు, ముగ్గులపోటీలు నిర్వహించారు. బి.చెర్లోపల్లె గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఎంపీటీసీ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు.

లింగాల : లింగాల మండలంలో ఆదివారం సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇళ్ల ముంగిట రంగు రంగుల ముగ్గులను వేసి గొబ్బెమ్మలను తీర్చిదిద్ది హారతులు ఇచ్చి సంబరాలను ఘనంగా నిర్వహించారు.

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో వైఎస్సార్ సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ముగ్గుల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు నగదు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిగా రూ. 3 వేలు, రెండవ బహుమతిగా రూ. 2 వేలు, మూడవ బహుమతిగా రూ. వెయ్యి అందజేశారు. అలాగే ముగ్గుల పోటీల్లో పాల్గొన్నప్రతి మహిళకు కన్సోలేషన్ బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో లింగాల మాజీ ఎంపీటీసీ లక్ష్మినారాయణమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు, ఐకేపీ ఏపీఎం ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంపల్లె : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వేంపల్లె బలిజ సంఘం వీధిలో వెలసిన శ్రీగౌరీదేవి ఆలయంలో ఆదివారం ముగ్గులపోటీలు నిర్వహించారు. ఆసంఘం అధ్యక్షులు నంబూరు కుళ్లాయప్ప, కటిక చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి లీలానందిని కైవసం చేసుకోగా, ద్వితీయ వైష్ణవి, తృతీయ స్వాతి, నాలుగవ బహుమతి జ్యోతి, ఐదవ బహుమతి ధన లక్ష్మి గెలుపొందారు. వారికి బలిజ సంఘ నాయకులు బహుమతులను అందజేశారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు కొత్తూరు రెడ్డయ్య, రంగయ్య, ఉపాధ్యక్షులు యడాల రాము, ఎద్దుల రామచంద్ర, కమిటీ సభ్యులు డాక్టర్ రాజారాం, నిత్యానంద, రాయుడు, రాజ్‌కుమార్, ముత్యాల అంజి తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె : సంక్రాంతి సందర్భంగా స్థానిక వృషభాచలేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత వృషభాచలేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ శ్రీధర్, చైర్మెన్ కురాకుల వెంకటేష్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది లక్ష్మిరెడ్డి, దాశిరెడ్డి, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల: సంక్రాంతి కనుమ సందర్భంగా సోమవారం సాయంత్రం ఎర్రగుంట్లలో పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. వేలాది జనాలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని నడివూరులోని శ్రీ రామాలయ దేవాలయం నుంచి శ్రీ ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహంను ఊరేగింపుగా కడప రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణంలోకి తీసుకుని పోయి అక్కడ శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. యర్రగుంట్ల వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ ఎం సురేంద్రనాథ్‌రెడ్డి, యర్రగుంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డిలు హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు శ్రీరామ భక్తి గీతాలతో గీతాపారాయణం భజన నిర్వహించారు. అలాగే ఈ ఉత్సవంలో చెక్కభజన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

మైలవరం (జమ్మలమడుగు రూరల్): పార్వేట ఉత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. మైలవరం మండలంలోని ధన్నవాడ, పలు గ్రామాల్లో ఉత్సవాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. ధన్నవాడ గ్రామంలో చెన్నకేశవ స్వామి, శ్రీదేవి, భూదేవి దేవతా మూర్తులను పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామం వెలుపల సంప్రదాయంగా పార్వేట నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

– జమ్మలమడుగు పట్టణంలోని పురవీధుల గుండా శ్రీవెంకటేశ్వరస్వామి సమేత శ్రీదేవి, భూదేవిలను ఘనంగా ఊరేగించారు. పార్వేట ఉత్సవం సందర్భంగా శ్రీవారిని పల్లకిలో ఊరేగించారు.

జమ్మలమడుగు: మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో సంక్రాంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. సోమవారం గ్రామంలోని లక్ష్మీచెన్న కేశవ స్వామికి గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం కనుమ పండుగ సందర్భంగా మండలంలోని ఊటుకూరు, బయనపల్లె, నాగిరెడ్డిపల్లె, చింతకొమ్మదిన్నె, తాడిగొట్ల, పబ్బాపురం, బుసిరెడ్డి పంచాయితీల్లోని గ్రామాల్లో గొబ్బెమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపులు నిర్వహించారు. అనంతరం సమీపంలోని బుగ్గవంకలో నిమజ్జనం చేశారు. నాగిరెడ్డిపల్లె, సికెదిన్నె, పడిగెలపల్లె గ్రామాల్లో ఏర్పాటు చేసిన పాట కచ్చేరి, చెక్క భజన భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నది.

వేముల : మండల వ్యాప్తంగా సంక్రాంతి వేడుకలను గ్రామాల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. కొత్త ఏడాదిలో వచ్చే మొదటి పండుగకు గ్రామాల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు బంధుమిత్రు లు, కుటుంబ సభ్యులతో గ్రామాలన్నీ కళకళలాడాయి. గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

జమ్మలమడుగు రూరల్: కనుమ పండుగను పురస్కరించుకుని జమ్మలమడుగు మండల పరిధిలోని పలు గ్రామాల్లో పార్వేట ఉత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని పెద్దదండ్లూరు గ్రామ సమీపంలో ఉన్న పెన్నానదిలో పార్వేట ఉత్సవాన్ని నిర్వహించారు. సున్నపురాళ్లపల్లె బసవేశ్వరస్వామి, దేవగుడి గ్రామం నుంచి శ్రీ సీతా రామలక్ష్మణుడు, పెద్దదండ్లూరు నుంచి గరుడవంతుడు దేవతామూర్తుల విగ్రహాలను పార్వేటకు తీసుకువచ్చారు. ఎస్ ఉప్పలపాడు గ్రామంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి విగ్రహాన్ని భక్తులు ఘనంగా ఊరేగింపు నిర్వహించారు.

చెన్నూరు : మండల కేంద్రమైన చెన్నూరు యూత్ లాంఫింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆరవ వార్షిక సందర్భంగా మూడు రోజులపాటు జరిగిన వివిధ ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు సోమవారం సాయంత్రంతో ముగిశాయి. ముగ్గుల పోటీలు, నృత్యప్రదర్శనలు, ఉట్టికొట్టే కార్యక్రమం, చిన్న పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. పెన్నానది ఒడ్డున వెలిసిన మల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించారు. నిర్వాహకులు అద్దంకి విశ్వనాథ్, నాగార్జున రాజు, మహేష్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

వీరపునాయునిపల్లె: హిందువుల సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి అన్నారు. మండలంలోని గోనుమాకులపల్లె గ్రామంలో గుర్రప్ప యాదవ్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకుడు రాజశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలలో ఆయన పాల్గొన్నారు. మండల స్థాయి రంగవల్లుల పోటీలు, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ట్రాక్టర్ రివర్స్, బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, వీరపునాయునిపల్లె ఎంపీటీసీ సభ్యుడు రాఘవ యాదవ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ నిర్వాహకులు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.

కొండాపురం: మండల పరిధిలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే మూలె సుధీర్‌రెడ్డి పేర్లతో సంక్రాంతి సంబరాల పోటీలను వైభవంగా నిర్వహించినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. హరినారాయణరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథులు గా ఎంపీడీఓ శ్రీనివాసులురెడ్డి, కొండాపురం సీఐ సుదర్శన్ ప్రసాదు, తాళ్ళప్రొద్దుటూరు ఎస్ఐ జె. రవికుమార్, ఉప మండలాధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, జి. విజయ భాస్కర్ రెడ్డి, జోగాపురం ప్రతాప్ రెడ్డి, తాళ్లప్రొద్దుటూరు సింగిల్ విండో అధ్యక్షుడు జగ్గు పుల్లన్న, ఎంపీటీసీ గురు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరయ్యారు. క్రికెట్ పోటీల్లో మొదటి బహుమతి కొండాపురం యూత్ టీం, రెండో బహుమతి కోనవారిపల్లె యూత్ టీం బహుమతులు అందుకున్నాయి. ముగ్గుల పోటీల్లో మహిళలకు బహుమతులు అందజేశారు. ఆటో రివర్స్, బైకు స్లో పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

చెన్నూరు : చెన్నూరు మండలం కొండపేట పెన్నానదిలో సోమవారం సాయంత్రం కనుమ పండుగను పురస్కరించుకుని పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం కొండపేట గ్రామంలో ఉన్న ఉమామహేశ్వరస్వామి (శివాలయం) ఉత్సవ విగ్రహాలను నంది వాహనంపై ఊరేగింపుగా కొండపేట పెన్నానది వద్దకు తీసుకు వచ్చారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకోవడానికి తరలివచ్చారు.

అనంతరం స్వామి వారిని ఊరేగింపుగా కొండపేట పురవీధులగుండా గ్రామోత్సవం నిర్వహించారు. పెన్నానదిలో పార్వేట ఉత్సవంలో భాగంగా తిరునాలను నిర్వహించారు. కనుమను పురస్కరించుకుని చెన్నూరు, కొండపేటతోపాటు వివిధ గ్రామాలకు చెందిన మహిళలు గొబ్బెమ్మలతో నృత్యాలు చేసుకుంటూ పెన్నానది వరకు వెళ్లి నదిలో నిమజ్జనం చేశారు.

వల్లూరు : వల్లూరులో సంక్రాంతి సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బూసిపాటి కరుణాకర్, సతీష్ కుమార్‌ల ఆధ్వర్యంలో సంబరాలను నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులు, మహిళలకు ఆటల పోటీలను, ముగ్గుల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి ఎస్ఐ విష్ణువర్ధన్ చేతుల మీదుగా బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో బాల చంద్ర, ప్రవీణ్, ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెండ్లిమర్రి: మండలంలోని వెల్లటూరు గ్రామంలో వెలసిన శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణం ఆలయ కార్యనిర్వాహకులు, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి అభిషేకాలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కన్నులారా తిలకించారు. వెయ్యినూతలకోన క్షేత్రంలో స్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

కమలాపురం: మండల పరిధిలోని కమలాపురం, కె.అప్పాయపల్లె, గంగవరం, విభరాపురం, సంబటూరు, కోగటం, పందిళ్లపల్లె, రాజుపాళెం, పెద్ద చెప్పలి, చిన్నచెప్పలి, దేవరాజుపల్లె, కొండాయపల్లె తదితర గ్రామాలలో ఆదివారం సంక్రాంతి, సోమవారం కనుమ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు.

టి.చదిపిరాళ్లలో: మండల పరిధిలోని టి.చదిపిరాళ్ల గ్రామంలో సోమవారం స్వాముల వారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. కనుమ పండుగను పురస్కరించుకొని స్థానిక వేణుగోపాల స్వామి దేవస్థానం నుంచి గ్రామ శివారు వరకు గ్రామోత్సవం నిర్వహించారు. వేణుగోపాల స్వామి, శివ పార్వతులు, సీతారాములు, ఆంజనేయ ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఏర్పాటు చేసి గ్రామంలోని పలు కాలనీలతో పాటు గ్రామ శివారు వరకు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం పారువేట కోలాహలంగా నిర్వహించారు. గ్రామ ప్రజల సమక్షంలో గొళ్లపల్లె వంక వద్ద కుందేలును పారువేటకు వదిలారు. పట్టుకున్న వారికి బహుమతులు అందజేశారు. ఎర్రగుడిపాడులో ఆదివారం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారికి అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వెలసిన ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం స్వామి వారిని ప్రత్యేక వాహనంలో ఏర్పాటు చేసి గ్రామ పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

కమలాపురం: కమలాపురం–ఖాజీపేట ప్రధాన రహదారిలో పట్టణ శివారులోని పాగేరు వంక వద్ద కనుమ పండుగ పురస్కరించుకొని సోమవారం నిర్వహించిన పారువేట ఉత్సవం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. పట్టణం నుంచే కాక సమీప ప్రాంతాల నుంచి తరలి వచ్చిన అశేష ప్రజానీకంతో పాగేరు వంక ప్రాంతం కిటకిట లాడింది. ఉత్సవకమిటీ అధ్యక్షుడు నీలం నరేంద్ర ఆధ్వర్యంలో పురుషులకు కబడ్డీ, బండ లాగుడు పోటీలు, వాలీబాల్, మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

అంతకు ముందు పట్టణంలోని శివాలయం నుంచి పాగేరు వంక వరకు శివ పార్వతులను ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. అలాగే కంచి వరదరాజ స్వామి వారిని ఆలయం నుంచి పాగేరు వంక వరకు ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా స్వామి వారిని తీసుకువచ్చారు.

పోటీల నిర్వహణ అభినందనీయం:

పాగేరు వంక సమీపంలో కనుమ పురస్కరించుకొని పోటీలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. కాగా అక్కడ ఏర్పాటు చేసిన బండ లాగుడు పోటీలను ఆయన ప్రారంభించారు. ఎడ్ల యజమానులకు నగదు బహుమతులు వరుసగా రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు అందించారు. మిగిలిన వారికి కన్సోలేషన్ బహుమతుల కింద బకెట్లు పంపిణీ చేశారు.



చెన్నూరు: ప్రత్యేక అలంకరణలో ఉత్సవ విగ్రహాలు



వల్లూరు: విజేతలకు బహుమతులను అందచేస్తున్న ఎస్ఐ విష్ణువర్ధన్



పెండ్లిమర్రి: కల్యాణోత్సవంలో ప్రత్యేక అలంకరణలో ఉత్సవ విగ్రహాలు



వేంపల్లె : ముగ్గులపోటీలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేస్తున్న దృశ్యం



లింగాల : ముగ్గులను తీర్చిదిద్దుతున్న మహిళలు



వేంపల్లె : వృషభాచలేశ్వరస్వామి గ్రామోత్సవం



సింహాద్రిపురం: బి.చెర్లోపల్లెలో ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులను ఇస్తున్న మనోహర్‌రెడ్డి



కొండాపురం: విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎస్ఐ



ఎర్రగుంట్ల: పార్వేట ఉత్సవంలో అలరించిన కోలాటం



ఎర్రగుంట్ల: పార్వేట ఉత్సవంలో అలరించిన చెక్కభజన



కమలాపురం: చదిపిరాళ్లలో జరిగిన పార్వేట ఉత్సవంలో పాల్గొన్న జనం



జమ్మలమడుగు రూరల్: పెద్దదండ్లూరులో ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



కమలాపురం: బండ లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న సంబటూరు ప్రసాద్ రెడ్డి



జమ్మలమడుగు రూరల్: శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరుడిని ఊరేగిస్తున్న భక్తులు